క్లుప్తంగా

సమాచారం లేకుండా గ్రామసభలు!



తహసీల్దార్‌తో వాగ్వాదం చేస్తున్న రైతు కృష్ణమనాయుడు

శ్రీరంగరాజపురం : ప్రభుత్వం నిర్వహించే ఏ కార్యక్రమమైనా అధికారులు ప్రజలకు తెలియజేస్తేనే సమాచారం అందుతుందని రెవెన్యూ గ్రామసభలో రైతు కృష్ణమనాయుడు తహసీల్దార్ లోకనాథపిళ్లైతో వాగ్వాదానికి దిగారు. మండలంలోని కటికపల్లిలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. కటికపల్లి రెవెన్యూలో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతోందని ఆరోపించారు. కటికపల్లి పంచాయతీలో అనేక భూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు గ్రామసభలు ప్రజలకు తెలియజేయకుండా నిర్వహిస్తే ప్రయోజనం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అనంతరం తహసీల్దార్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మార్కోండయ్య, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ



ఎస్టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నేతలు

పాలసముద్రం : ఎస్టీయూ నూతన సంవత్సరం 2025 క్యాలెండర్, డైరీలను మండల ఎస్టీ యూ అధ్యక్షుడు కుమార్, ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్ గురువారం ఎమ్మార్సీ భవనం ఆవరణ లో ఆవిష్కరించారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు కుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలపై యూనియన్ అండగా ఉంటుంద ని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయు ప్రధాన కార్యదర్శి ప్రకాష్, వెంకటేశులు, దనరాజ్, చంద్రశేఖర్, దేవరాజ్, ఆరుమగం, ఆనందయ్య, వేణుగోపాల్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్లు..



క్యాలెండర్లతో ఎంఈఓలు, ఉపాధ్యాయులు

కార్వేటినగరం : స్థానిక మండల వనరుల కేంద్రంలో గురువారం ఎంఈఓలు విజయకుమార్, మనోజ్‌కుమార్ యూటీఎఫ్ 2025 డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. యూటీఎఫ్ మండల అధ్యక్షులు రాబర్ట్ జైశీలన్, గౌరవ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి సి.జయ శంకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎస్టీయూ క్యాలెండర్లు..



ఎస్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

శ్రీ రంగరాజపురం : మండల ఉపాధ్యాయుల ఎస్టీయూ సంఘం నూతన క్యాలెండర్లను మండల విద్యాభివృద్ధి అధికారి అరుణాచలం రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 సబర్మతి, ఎస్టీయూ సంఘం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

శ్రీరంగరాజపురం : విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు కృషి చేయాలని మండల విద్యాభివృద్ధి అధికారి అరుణాచలంరెడ్డి అన్నారు. మండలంలోని విద్యా వనరుల కేంద్రంలో ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల ప్రవర్తన పై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రస్తుత సమాజంలో విద్యార్థులు సెల్ ఫోన్లకు బానిసలవుతున్నారని తెలిపారు.

ఓంశక్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు

పాలసముద్రం : మండలంలోని ఆముదాల పంచాయతీ కొత్తకండ్రిగలో గురువారం ఓం శక్తి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఓం శక్తి మాల ధరించిన భక్తులు అమ్మవారికి అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇరుముడి కట్టుకుని మేల్‌మరవత్తూరులోని ఓం శక్తి అమ్మవారి దర్శనానికి బయలు దేరారు.


రీ సర్వేతో భూసమస్యల పరిష్కారం

పాలసముద్రం : మండలంలో రీ సర్వేతో భూసమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. గురువారం క్రిష్ణజమ్మపురం పంచాయతీల్లో రైతులకు రీ సర్వేలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ అరుణకుమారి మాట్లాడుతూ.. ప్రస్తుతం రెండో విడత రీసర్వే చేసేందుకు క్రిష్ణజమ్మపురం రెవెన్యూ ప్రాజెక్టులో రీ సర్వే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రిషి వర్మ, ఎంఆర్ఐ దేవి, మండల సర్వేయర్ గణేష్, వీఎస్ఎస్ మునిరత్నం, రైతులు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

ఇటీవల నదిలో కొట్టుకుపోతున్న వ్యక్తిని లాక్కొస్తున్న యువకుడు (ఫైల్)



రెండేళ్లక్రితం నదిలో కొట్టుకుపోయిన వ్యక్తి (ఫైల్)



నీరు లేనిసమయంలో ముళ్లకంపలతో కుశస్థలి నది



సరదా.. కాకూడదు వ్యధ

పండుగ, సెలవు రోజుల్లో సరదాగా గడిపేందుకు నదీ ప్రాంతాలకు వెళ్లి కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. అవగాహన లేక నీళ్లలో దిగి, చివరకు గల్లంతై, తిరిగి రానిలోకాలకు చేరుతున్నారు. కుటుంబ సభ్యులకు తీరని వ్యధ మిగుల్చుతున్నారు. పారే నది నీటిలో ఆటలాడితే ప్రాణాలతో చెలగాటమేనని మరోసారి తేటతెల్లమైంది. నూతన సంవత్సర వేడుకల్లో మిత్రులతో కలిసి ఎంజాయ్ చేయడానికి వెళ్లిన పదవ తరగతి విద్యార్థి నదిలో మునిగి చనిపోవడం తీరని విషాదం నింపింది. కొన్నేళ్ల కాలంలో ఇలాంటి ఉదంతాలు ఎన్నో చోటుచేసుకున్నా ప్రజల్లో సరైన అవగాహన లేదని ఈ ఘటన చాటిచెప్పినట్టైంది.

- నది నీటిలో ఆటలొద్దు
- అప్రమత్తంగా లేకపోతే పోయేది ప్రాణాలే
- అనర్థాలకు దారితీస్తున్నా జాగృతం కాని వైనం





మజీద్ మృతదేహాన్ని రాత్రి బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది, ఇటీవల ముళ్లకంపల్లో తగులుకున్న చేపలుపట్టే వ్యక్తిని కాపాడిన యువకులు (ఫైల్)

నగరి : కుశస్థలి నదిలో ఏడాది పొడవునా నీటి ప్రవాహం ఉండదు. నవంబర్, డిసెంబర్‌లో వర్షపాతం ఎక్కువగా నమోదయ్యే సమయంలో, కృష్ణాపురం డ్యామ్ గేటు తెరచినప్పుడు నదిలో నీటి ప్రవాహం ఒకింత ఉధృతంగా ఉంటుంది. కీళపట్టు మార్గంలో లోతట్టు వంతెనపై నుంచి కూడా ప్రవాహం ఉంటుంది. ఆ సమయాల్లో వంతెనకు రెండువైపులా బారికేడ్లు వేసి దారి మూసివేస్తారు.

అయితే ఆకతాయిలు, చేపలు పట్టాలని బారికేడ్లు దాటి లోపలకు వెళుతూ ఉంటారు. అలా వెళ్లేవారు నదినీటిలో కొట్టుకుపోతున్నారు. వీరిలో కొందరిని కాపాడి ఒడ్డుకు చేర్చినా కొందరు మృత్యుఒడికి చేరుకుంటున్నారు. కొన్ని సమయాల్లో పశువులు సైతం కొట్టుకుపోయిన సందర్భాలు అనేకం.

కుశస్థలి రూపురేఖలు మారడమే కారణం

కుశస్థలి నదిలో సరదా ఆటలకు దిగితే మృత్యు ఒడిలోకి దిగినట్టే. కుశస్థలి అంటే పూర్వంలా పైవరకు ఇసుకమేటలతో నిండి చల్లటి ఆహ్లాదానికి, అపాయ రహిత స్నానాలకు తోడ్పడిన నది కాదు. ఇప్పుడు కుశస్థలిలో ఇసుకను అడుగులోని బంకమట్టితో సహా ఎత్తివేశారు. దీంతో నది మొత్తం రాళ్లు, రప్పలు, గోతులు, పూర్తిస్థాయిలో ముళ్లకంపలతో మాత్రమే నిండి ఉంది. నదిలో నీరుపారే సమయంలో ఇవి పైకి కనిపించవు. నదే కదా అని దిగితే ఇంక అంతే! రాళ్లు తగలడం, ముళ్లకంపలకు చిక్కుకోవడం..అవి పక్కకు లాగేయడమే నూతన సంవత్సర సంబరంలో అదుపు తప్పి నది నీటిలో పడ్డ విద్యార్థి మజీద్ మృతికి కారణమైంది.

మృతులంతా విద్యార్థులే

కుశస్థలి నదిలో ఆటలకంటూ వెళ్లి మృత్యువాత పడిన వారిలో అధికులు విద్యార్థులే ఉన్నారు. కొన్నేళ్ల క్రితం బుగ్గ దేవాలయం సమీపాన కుశస్థలి నదిలో కొట్టుకుపోయి మృత్యువాత పడితే, రెండేళ్ల క్రితం బుగ్గ కండ్రిగ వద్ద ఈతకు వెళ్లి ఒక విద్యార్థి కొట్టుకుపోయి మృత్యువాత పడ్డాడు. నెల వ్యవధిలోనే లోతట్టు వంతెనపై నీరు ప్రవహిస్తున్నా లెక్కచేయక ద్విచక్రవాహనంలో వెళ్లిన కార్మికుడు వాహనంతో పాటు కొట్టుకుపోతే అతి కష్టం మీద కాపాడారు. వాహనం కొట్టుకుపోయింది. అలాగే చేపలు పట్టడానికి వెళ్లిన ఒక వ్యక్తి కొట్టుకుపోతే స్థానిక యువకులు కాపాడి ఒడ్డుకు చేర్చారు. ఇలాంటి పలు సంఘటనలు చూస్తున్నా జాగ్రత్తలు వహించడం లేదనేది చేదు నిజం.

అప్రమత్తత అవసరం



పిల్లల విషయంలో తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలి. నదిలో నీరు ప్రవహిస్తోందని, అటువైపు వెళ్లరాదని వివిధ మాధ్యమాల ద్వారా తెలియజేశాం. నది ఒడ్డున ఉన్న గ్రామాలకు పోలీసులను పంపి అవగాహన కల్పించాం. అయితే నెల రోజుల్లో హెచ్చరికలను అతిక్రమించి వెళ్లి, నది నీటిలో కొట్టుకుపోయిన ఇద్దరిని రక్షించాం. ఇలాంటి సంఘటనలపై ప్రజలు, పిల్లల తల్లిదండ్రులు అప్రమత్తం కావాలి. తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు? వెళ్లి ఎంత సమయమైంది? ఇంకనూ ఎందుకు రాలేదు? అనే వాటిపై అలర్ట్ అయితే ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయి.

– మహేశ్వర్, సీఐ, నగరి

• పరామర్శ



వరద రాజులురెడ్డిని పరామర్శిస్తున్న కృపాలక్ష్మి

గంగాధర నెల్లూరు: మండలంలోని ఎట్టేరికి చెందిన మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు జనార్దన్‌రెడ్డి అనారోగ్యం బారిన పడి, ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి ఆయనను పరామర్శించారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షించారు. అలాగే, వేపంజేరి పంచాయతీ మాజీ సర్పంచ్ వరదరాజులు రెడ్డి(పెద్దిరెడ్డి) తండ్రి చిన్నబ్బరెడ్డి (110) బుధవారం మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని సైతం కృపాలక్ష్మి పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షులు వేల్కూరు బాబురెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, పార్టీ నాయకులు రూపశేఖర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, కోదండరెడ్డి, రఘుపతి రెడ్డి, బూత్ కన్వీనర్ వెంకటేష్‌రెడ్డి, వేల్కూరు కుట్టి, పలువురు యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లల ప్రగతి సాధనపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈఓ

నిండ్ర: రాష్ట్ర సమగ్ర శిక్షణ అభియాన్ ద్వారా ప్రతి పాఠశాల పిల్లల ప్రగతి సాధన అంశాలపై గురువారం స్థానిక జెడ్పీ హైస్కూల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ వసుమతి, శ్రీధర్ రాజు మాట్లాడారు. విద్యార్థులు ప్రతి తరగతిలోనూ మంచి ఉత్తీర్ణత సాధించేలా టీచర్లు విద్యాబోధన చేయాలని, ప్రభుత్వ పథకాల ఫలాలు అందివ్వాలని కోరారు. అలాగే తల్లిదండ్రుల కమిటీ సభ్యులు స్కూలు అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, టీచర్లు పాల్గొన్నారు.

మహిషాసుర మర్ధినిగా కాళీమాత

నగరి: మున్సిపల్ పరిధి నెత్తం కండ్రిగలోని కాళీమాత ఆలయంలో ధనుర్మాస పూజల్లో భాగంగా గురువారం అమ్మవారికి మహిషాసుర మర్ధిని అలంకారం చేశారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు ప్రసాదాలు అందజేశారు.



ఉద్యోగులు సమయపాలన పాటించాలి



ఆన్‌లైన్ సర్వేని పరిశీలిస్తున్న రవికుమార్

పాలసముద్రం : మండల పరిధిలోని ఉద్యోగులు సమయపాలన పాటించాలని జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారి రవికుమార్‌నాయుడు ఆదేశించారు. గురువారం పాలసముద్రం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ క్రిష్ణమహేష్ రెడ్డి, విస్తరణాధికారి రమేష్, ఏఓ మధువాణి పాల్గొన్నారు.

'మా గ్రామానికి దారి చూపించండి'

వెదురుకుప్పం : మట్టి రోడ్డుపై ముళ్ల కంపలు, రాళ్లు వేసి రోడ్డు మూసి వేశారు.. విద్యార్థులు పాతగుంటకు వెళ్లాలన్నా మండల కేంద్రానికి వెళ్లాలన్నా దారి లేక అవస్థలు పడుతున్నాం...గ్రామం నుంచి బయట ప్రపంచానికి వెళ్లాలంటే దారి లేదు...దారి సౌకర్యం కల్పించాలని మండలంలోని కేవీఎం అగ్రహారం గ్రామస్తులు గురువారం తహసీల్దార్ రమేష్‌బాబుకు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తరాలుగా ఉన్న రోడ్డును బలిజపల్లె గ్రామస్తులు మూసివేసి అడ్డుకుంటున్నారని వాపోయారు. గ్రామం నుంచి విద్యార్థులు పాతగుంట జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్నారని ఈకారణంగా పాఠశాలకు వెళ్లేందుకు దారి లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. అదే విధంగా తమ అవసరాల నిమిత్తం బయటి ప్రాంతాలకు వెళ్లాలన్నా రోడ్డు లేక ఇక్కట్లు పడుతున్నట్లు పేర్కొన్నారు. మూడు రోజులుగా దారి లేకుండా బయటకు వెళ్లలేకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దారి సమస్యకు శాశ్వతపరిష్కారం చూపాలని కోరారు.

నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పై కొరడా

- హద్దు మీరితే జరిమానాల మోత
- కొత్త నిబంధనల అమలుకు చర్యలు
- పోలీసు, రవాణాశాఖ సంయుక్త కార్యాచరణ





రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ భారతి (ఫైల్)

పాలసముద్రం : కొత్త సంవత్సరంలో రోడ్డు భద్రత నిబంధనలు మారనున్నాయి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మోత మోగనుంది. ఇకపై వాహన యజమానులు జాగ్రత్త పడాల్సిందే. రహదారి నిబంధనలను కఠినతరం చేసేందుకు రవాణాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇటీవల హైకోర్టు ధర్మాసనం నిబంధనలు సరిగా అమలు చేయడం లేదంటూ పోలీసు, రవాణాశాఖ అధికారులపై అక్షింతలు వేసింది. ఈ క్రమంలో నిబంధనలు పాటించని వాహనదారులపై పోలీసు, రవాణాశాఖ అధికారులు కొరడా ఝళిపించనున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నూతన రహదారి భద్రతా నియమాలు అమల్లోకి వచ్చాయి. అయితే వాటిని పక్కాగా అమలు చేయలేదనే చెప్పాలి. రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నియంత్రణ, హైకోర్టు ఆదేశాల అమలులో భాగంగా అధికారులు నిబంధనలను కఠినతరం చేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే హెల్మెట్ ధారణపై ప్రత్యేక డ్రైవ్‌లతో ముందుకు వెళుతున్న పోలీసు, రవాణాశాఖ అధికారులు ఇకపై పూర్తిస్థాయి నిబంధనలపై దృష్టి సారించనున్నారు.

మైనర్లు వాహనం నడిపితే జైలుకే

మైనర్లు వాహనం నడిపితే గతంలో చిన్నాచితక జరిమానాలతో సరిపోయేది. ఇక మైనర్‌లు వాహనాలు నడిపితే రూ.25 వేల జరిమానాతో పాటు వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి మూడేళ్ల వరకు జైలు శిక్ష పడేలా చర్యలు తీసుకోనున్నారు.

వాహనదారులకు అవగాహన

ఈ ఏడాది జనవరి నుంచే ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా అమలు చేసే విధంగా నడుంబిగించారు. ఇప్పటికే ఆటోవాలాలు, ద్విచక్ర వాహదారులకు అవగాహన కార్యక్రమాలు పోలీసులు నిర్వహిస్తున్నారు. నిబంధనలు పాటించకపోతే భారీ జరిమానాల వడ్డింపు మాత్రం తథ్యమేనని తెలుస్తోంది. ఇప్పటికే కార్వేటీనగరం సీఐ హనుమంతప్ప, పాలసముద్రం ఎస్ఐ చిన్నరెడ్డప్ప హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు భారీగా జరిమానాలు విధిస్తున్నారు.

హద్దు మీరితే జరిమానాలు ఇలా..



- లైసెన్స్ లేకుండా డ్రైవ్ చేస్తే గతంలో రూ. 500 జరిమానా విధించేవారు. ఇప్పుడు దాన్ని రూ.5000కు పెంచారు.
- రెడ్ సిగ్నల్ ఉల్లంఘించి వాహనాలు నడిపితే రూ.500 జరిమానా
- అతివేగం, ర్యాష్, స్నేక్ డ్రైవింగ్ చేస్తే రూ.1000 జరిమానాతో పాటు కేసు
- రాంగ్ రూట్‌లో వాహనాన్ని నడిపితే రూ.5000 ఫైన్
- మద్యం తాగి వాహనం నడిపితే గతంలో రూ.2,300 ఉన్న జరిమానా ఇప్పుడు ఏకంగా రూ.10 వేలకు పెంచారు. దీంతో పాటు ఒకటి లేదా రెండు రోజుల జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉంది.
- రేసింగ్, స్పీడ్ డ్రైవ్ చేస్తే రూ. 5 వేలు వసూలు చేయనున్నారు.
- హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం, సీట్ బెల్టు ధరించకుండా కారు నడిపితే రూ. వెయ్యి కట్టాల్సిందే. దీనికి తోడు మూడు నెలలు లైసెన్స్ రద్దు చేస్తారు.
- ద్విచక్ర వాహనాల్లో ట్రిపుల్ రైడింగ్ చేస్తూ పట్టుబడితే రూ.2 వేల వరకు చలాన్లు రాయనున్నారు.
- ఇన్సూరెన్స్ లేకుండా వాహనాన్ని నడిపితే రూ.2 వేలు జరిమానా

ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి



వాహనాలతో రోడ్డు ఎక్కే ప్రతి ఒక్కరూ కచ్చితంగా నిబంధనలు పాటించాలి. నూతన సంవత్సరంలో నిబంధనల అమలుపై దృష్టి సారిస్తున్నాం. ఇప్పటికే రోడ్డు నిబంధనలపై పలు సూచనలు చేశాం. మైనర్లు వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించాం. ఇకపై వాహనాల తనిఖీలు ముమ్మరం చేస్తాం. జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి.

– సాయినాథ్, ఇన్‌చార్జి డీఎస్పీ

శిక్షణ ఐఏఎస్‌కు సన్మానం



శిక్షణ ఐఏఎస్‌ను సన్మానిస్తున్న ఎంపీడీఓ

గంగాధర నెల్లూరు : చిత్తూరు కలెక్టర్ ఆదేశాల మేరకు గంగాధర నెల్లూరు ఇండిపెండెంట్ ఎంపీడీఓగా మూడు వారాల పాటు శిక్షణ కోసం వచ్చిన ఐఏఎస్ హిమావంశీని గంగాధర నెల్లూరు ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి సత్కరించారు. ఈ సందర్భంగా ఐఏఎస్ హిమావంశీ కార్యాలయాన్ని పరిశీలించి , సిబ్బంది నిర్వహిస్తున్న కార్యకలాపాలపై చర్చించి పథకాలు అమలుపై వివరాలు సేకరించారు.

విద్యార్థుల అంకెల గారడి



మంగళపల్లె విద్యార్థులు రూపొందించిన అంకెల చదరాలు

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గురువారం అంకెల గారడీతో 2025 సంవత్సరానికి ఆహ్వానం పలికారు. పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థులు సిరి, కీర్తన, జనని 3, 4, 5 గళ్ల వింత చదరాలతో ఎటు కూడినా 2025 వచ్చేలా పూరించారు. గణిత అవధాని అరుణ్‌శివప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు పూర్తించిన 3బై3, 4బై4, 5బై5 వింత చదరాలతో ఎటు కూడినా 2025 పూరించారన్నారు. 4బై4 వింత చదరంలో 24 రకాలుగా ఎటు కూడినా 2025 వస్తుందన్నారు. వింత చదరాల అంకెల గారడీ చేసిన విద్యార్థులను హెచ్ఎం రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు సంజీవి, రమాదేవి, పిళ్లారప్ప, సంపంగి, ధనశేఖర్, భారతి, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు అభినందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన గణితఅవధాని అరుణ్‌శివప్రసాద్‌ను అభినందించారు.